క్లుప్తంగా

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీ



బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో విద్యుత్ శాఖ ఏడీఈ విజయసారథి ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ తనిఖీలను నిర్వహించారు. 540 సర్వీసులను పరిశీలించారు. అక్రమంగా విద్యుత్ పొందుతున్న వారిపై 11 కేసులను బుక్ చేసినట్లు వారు తెలిపారు. ఇచ్చోడ ఏడీఈ సుబ్రహ్మణ్యం, డీఈఈ ఏఈ యోగేష్, ఏఈ వెంకటేష్, నాగేంద్ర ప్రసాద్, మహేందర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేఆర్‌కే కాలనీలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. వార్డ్ వాచ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేఆర్‌కే కాలనీలోని 7, 8వ వార్డుల్లో పర్యటించారు. పలు వీధుల్లో కాలినడకన తిరుగుతూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దయనీయంగా ఉన్న కాలనీలో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో పట్టణంలోని అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, వార్డు కౌన్సిలర్ అంజు బాయి, మాజీ ఎంపీటీసీ సంతోష్, వార్డు టీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్న, రాజు పాల్గొన్నారు.

మైనార్టీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు

ఇచ్చోడ: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల పట్ల చిన్న చూపు చూస్తుందని ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మైనార్టీల అభివృద్ధికి చేసింది శూన్యమని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి పైసా నిధులు ఇవ్వకుండా కేవలం ఎన్నికలు సమీపిస్తున్నందున మైనార్టీలకు రుణాల పేరుతో ప్రభుత్వం హంగామా చేస్తుందన్నారు. నియోజకరవ్గంలో కేవలం 55 మందికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రుణాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఇచ్చోడ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి భీమన్న, ఎస్సీసెల్, మైనార్టీ సెల్ కన్వీనర్ లక్ష్మణ్, ముస్తాఫా ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా దుస్తులు అందిస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

ఇంద్రవెల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. మంగళవారం మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో కమిషనర్ గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్ ద్వారా అందించిన స్కౌట్ అండ్ గైడ్స్ దుస్తులను స్కౌట్ అండ్ గైడ్ జిల్లా ఇన్‌చార్జి అధికారి యాదవరావ్‌తో కలిసి విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పుష్పలత మాట్లాడారు.

ఫైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని ఫైలేరియా బాధితులకు ఎం.ఎం.డి.పి కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 22 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు వైద్యశాఖ తరఫున గ్రామసర్పంచ్ రమ అందజేశారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఉండాల్సిన వాటిపై వైద్యశాఖ తరఫున అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య వీస్త్రీర్ణధికారి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఏఎన్ఎం భాగ్యవతి, ఆశ కార్యకర్తలు అనుసూయ, సాజిద ఉన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

బోథ్: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ సోదరుడు భిక్కు నాయక్ ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్సీ దండె విఠల్ మంగళవారం ఎమ్మెల్యేను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు ఉన్నారు.

సావిత్రీబాయి ఫూలే ఆదర్శనీయం



ఆదిలాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న మహిళలు



ఆదిలాబాద్‌టౌన్: సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఐఈఓ రవీంద్ర కుమార్

ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సావిత్రీబాయి ఫూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, పలు పార్టీల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మహిళల కోసం చేసిన కృషిని వక్తలు తెలియజేశారు. ఆమెను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఇంద్రవెల్లిలో...

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో హెల్ప్‌వీల్ ఫౌండేషన్‌తో పాటు అంబేద్కర్ భవనంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ కోరేంగా సుంకట్‌రావ్, దళిత సంఘాల నాయకులు సర్కలే శివాజీ, కాంబ్లే అతీష్, విఠల్, బామ్నే బాబా, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్ ఉన్నారు.

జైనథ్‌లో...

జైనథ్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. బాలిక విద్య కోసం పునాదులు వేసిన మహనీయురాలిగా సావిత్రిబాయి పూలే అని అభివర్ణించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్లే, కొనిగెల నారాయణ ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్‌అర్బన్: సీఐటీయూ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి మాట్లాడారు. వినోద, అమీనా, సంగీత, షబానాబేగం, రేఖ ఉన్నారు.

తాంసిలో...

తాంసి: తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, అధ్యాపకులు సంతోష్, పిప్పల్‌కోటి పాఠశాల హెచ్ఎం శంకర్ ఉన్నారు.

బజార్‌హత్నూర్‌లో..

బజార్‌హత్నూర్: మండలంలోని కిన్నెరపల్లి, మోర్కండి, దేగామ, బజార్‌హత్నూర్ గ్రామాల్లో మంగళవారం స్వేరోస్, బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్, జిల్లా ఇన్‌చార్జి జంగుబాపు, స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్‌కుమార్, ప్రేమకళ, కానిందే రాజారాం, జగదీశ్వర్, ప్రసాద్, శ్రీనివాస్, మాదవ్, ఉమా, సవిత, వినోద్, అక్షయ్, ప్రభు, ఊశన్న పాల్గొన్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షులు శాంతపురం రాజేశ్వర్, నాయకులు మహేశ్‌కుమార్, బొజ్జరాజేందర్, బత్తుల అరుణ్‌కుమార్, శివ ఉన్నారు.

మహిళా సాధికారతకు పునాది..

నేరడిగొండ: మహిళా సాధికారతకు బలమైన పునాదులు వేశారని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని రాజుర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు నోట్‌బుక్‌లను అందజేశారు. విద్యార్థులకు ఎంపీపీ రాథోడ్ సజన్ బ్యాగ్స్, స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు మల్లేశ్వరి, సర్పంచ్ అనుషబాయి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్‌సింగ్, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, దళిత మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుపట్ల సంజీవ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, ఓబిసి మోర్చ మండల కార్యదర్శి బాక్రె శేఖర్, గిరిజన మోర్చ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉద్దల్ సింగ్ ఉన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా..

ఆదిలాబాద్‌రూరల్: మహనీయుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తోందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తపూర్ కాలనీలోని పూలే చౌక్‌లో అఖిల భారతీయ మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ప్రకాష్, అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈర్ల సత్యనారాయణ, నాయకులు బండారి దేవన్న, చిక్కాల దత్తు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి...

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి నిర్వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి కోరెడ్డి పార్థసారథి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, చిక్కాల దత్తు ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఆదిలాబాద్ పట్టణంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, ఆశన్న, కిరణ్, సురేందర్, మంజుల, స్వామి, రోజ, రాధ, సలీమ్ పాల్గొన్నారు.

కళాశాలల్లో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈఓ రవీంద్ర కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విఠల్, లెక్చరర్లు శ్రీనివాస్, బాలాజీ, నాగోరావు, నారాయణ రెడ్డి, మహేశ్వరి, శిల్ప, జ్యోతిర్మయి, సుధాకర్, వినోద్, దేవిచంద్ ఉన్నారు.

బేలలో..

బేల: మండల కేంద్రంలో ప్రిన్సిపాల్‌లు సూర్యప్రకాశ్, వరప్రసాద్ రావు, హెచ్ఎం కోల నర్సింలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మండల అధ్యక్షుడు సతీశ్, ప్రిన్సిపల్ స్వామి, బాబా శ్యామ్ ఉన్నారు.

బోథ్: మండలం కేంద్రంలోని టిఎస్ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి ప్రిన్సిపాల్ స్వర్ణలత పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలో మాలీ సంఘం ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, హెచ్ఎం శ్యామ్‌సుందర్, వినోద్ రెడ్డి, రాజేందర్, మురళిదర్ ఉన్నారు.



ఇంద్రవెల్లిలో...



జైనథ్‌లో...



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న ప్రేమేందర్



చిత్రపటానికి పూజ చేస్తున్న విజయ్



ఇచ్చోడలో..



బేల: సోన్‌కాస్‌లో..



బోథ్: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ స్వర్ణలత



బీసీ సంఘం ఆధ్వర్యంలో..



పూలమాలలు వేస్తూ..



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ,

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా ఎన్టీఆర్‌చౌక్‌లో తొలగించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లూరి రాజారెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని గత మే నెలలో తొలగించారని, ఈ విషయమై తమ పార్టీ నాయకులు కలిసి విన్నవించినప్పుడు పునఃప్రతిష్టిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీ రఫీక్, బి.రాజేశ్వరరావు, జనార్దన్ భారతి, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, సుభాష్ సురేందర్, పొచ్చన్న, ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ఆధ్వర్యంలో కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ కాల్ సెంటర్ కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు జక్కుల శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆదిలాబాద్ పట్టణంలోని పీఎంకేవీవై కార్యాలయంలో ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్స్ 9381121408, 9182448060పై సంప్రదించాలన్నారు.

నేడు సైన్స్‌ఫేర్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలలో బుధవారం సైన్స్‌ఫేర్ నిర్వహించనున్నట్లు ఏటీడీవో నిహారిక ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉదయం 8గంటల్లోపు ప్రదర్శనలు తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్, డీడీ దిలీప్ కుమార్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు వివరించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మన్ సింగ్‌ను బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్, కనుగుట్ట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మణ్‌లు మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. బోథ్ సర్పంచ్ సురేందర్, కొటాడి స్వామి, సత్యనారాయణ, లింబాజీ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజితాండ ఎక్స్ రోడ్డు గ్రామంలో రైతు హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జెండాను ఎగురవేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలను ప్రస్తావించారు. రైతు హక్కుల సాధన సమితి ముందుకు సాగుతుందని జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్ అన్నారు. సర్పంచ్ హరినాయక్ ఉన్నారు.

‘అన్ని వర్గాలను మోసం చేస్తున్న కేసీఆర్’



సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: బంగారు తెలగాణ పేరుతో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మునుగోడు ఎన్నికల సమయంలో గొల్ల కుర్మ, యాదవ కులస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గొర్రెల యూనిట్ల కోసం జిల్లాలో నాలుగు నెలల క్రితం 2076 మంది ఒక్కొక్కరు రూ.43,700 చొప్పున రూ.9,08,25,000 కట్టి నెలలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్లు పంపిణీ చేయడం లేదని మండిపడ్డారు. లబ్ధిదారుల్లో చాలా మంది అప్పులు చేసి డబ్బులను కట్టారని, ఇప్పటికైనా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో నాయకులు గటిక క్రాంతికుమార్, సంతోష్ యాదవ్, లంక శ్రీనివాస్, చాకటి కిరణ్, గెడం రాము, శివకిరన్, అక్షయ్, ఆనంద్, జంగుబాయి పాల్గొన్నారు.

గుబిడి గ్రామానికి బస్సు సర్వీస్ ప్రారంభం



గుబిడిలో బస్సుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామానికి మంగళవారం నుంచి ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. గుబిడి గ్రామానికి వర్షాకాలంలో సరైన రోడ్డు సౌకర్యం, కరంజి(టి) వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం లేక ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌ను నిలిపివేశారు. ప్రస్తుతం కరంజి(టి) వాగు వద్ద నీటి ప్రవాహం లేకపోవడంతో పాటు గ్రామస్తులు రోడ్డును సైతం బాగు చేసుకోని బస్సు సర్వీస్‌ను నడిపించాలని కోరారు. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్ గ్రామస్తులు ఇస్తారి, నవీన్, రవిందర్ రెడ్డి ఉన్నారు.

‘ప్రయోగాత్మక విద్య మంచి ఫలితాలిస్తుంది’



పరీక్షిస్తున్న ఎంఈవో

గుడిహత్నూర్: ప్రయోగాత్మక విద్య మంచి ఫలితాలిస్తుందని జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంఈవో నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన టీఎల్ఎం (టీచర్స్ టర్నింగ్ మెటీరియల్) మేళాను ప్రారంభించి మాట్లాడారు. గత కరోనా కాలంలో విద్యార్థులకు కలిగిన నష్టంతో ప్రాథమిక విద్యను పూర్తి స్థాయిలో పొందక పోవడంతో ప్రభుత్వం వీరి కోసం చదవడం, గణితాన్ని గుర్తించడమే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా టీఎల్ఎం నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో నారాయణ అన్నారు. సామగ్రితో చదువుకోవడం ద్వారా విద్యార్థి ఆలోచనా శక్తి పెరిగి మెరుగైన ఫలితాలు అందుతాయన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో సునీత, సెక్టోరియల్ అధికారి నర్సయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ నిర్వహణ వారోత్సవాలు

ఆదిలాబాద్‌అర్బన్: ఈ నెల 4 నుంచి 12 వరకు విద్యుత్ నిర్వహణ వారోత్సవాలు నిర్వహించనున్నామని, దీంతో ఆయా ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఆదిలాబాద్ టౌన్-3 సహాయ ఇంజనీర్ డి.శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైన్స్ నిర్వహణ నిమిత్తం ఈ నెల 4న కైలాస్‌నగర్, 5న ఏరోడ్రమ్, 7న పాలిటెక్నిక్, 8న శాంతినగర్, 9న టీచర్స్ కాలనీ, 10న సప్తగిరి కాలనీ, 11న కలెక్టర్ చౌక్, 12న ఆదిలాబాద్ టౌన్-6 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు మండల స్థాయి టీఎల్ఎం మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మండల స్థాయి టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) మేళాను బుధవారం ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి జయశీల ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల నుంచి బోధనోపకరణాలను ప్రదర్శించాలని సూచించారు.

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం టీఎల్ఎం మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డిలతో పాటు ఇతర ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మైనార్టీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి

గుడిహత్నూర్: ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయించిన రూ.50 కోట్లు సరిపోవని దీనిని రూ.500 కోట్లకు పెంచాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఆడే సునీల్ అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టిప్పు సుల్తాన్ యూత్ సభ్యులతో కలిసి తహసీల్దార్ సంధ్యారాణికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సుల్తాన్ యూత్ సభ్యులు సహజాద్ ఖురేషి, షేక్ కరీం, షేక్ రషీద్ ఉన్నారు.

శాంతిభద్రతల రక్షణలో ముందుంటాం



సీఐ, ఎస్సైలను సన్మానిస్తున్న ధన్నూర్ గ్రామస్తులు

బోథ్: శాంతి భద్రతల రక్షణలో ముందుంటామని సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధన్నూర్ (బి) గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో కులమత బేధాలు లేకుండా కలిసి ఉండాలని అన్నారు. వ్యసనాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. మత్తు పదార్థులు సేవించరాదని తెలిపారు. సీఐ, ఎస్సైలను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందుల గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నారాయణ రెడ్డి, విడిసి అధ్యక్షులు మహేందర్ గౌడ్, అశోక్ రెడ్డి, పసుల చంటి, రమేష్, రవి పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: బోథ్ నియోజకవర్గంలో అర్హులైన మాదిగలకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోథ్ నియోజకవర్గ పరిధిలో దళితుల జనాభాలో మెజార్టీ మాదిగలే ఉన్నారని, ప్రభుత్వ పథకాలైన దళితబస్తీ, డబుల్ బెడ్ రూమ్, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళితబంధు, తదితర పథకాల్లో ప్రాధాన్యత పెంచాలన్నారు. గ్రామ, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ హాళ్లు, స్థలాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన వారు ఉన్నా ప్రభుత్వ పథకాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, సుభాష్, నవీన్, గణేష్, అశోక్, స్వామి, శ్రీకాంత్ ఉన్నారు.